18052025-DIS-04_Layout 1 5/18/2025 2:47 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

# యుద్ధభూమిలో అస్త్ర సన్యాసం

**బుధవారం పొద్దున్నే.. మత్తు కండ్లు నలుసుకుంటా టీవీ దిక్కు చూస్తే 'ఆపరేషన్ సిందూర్' అని ఇంగ్లిష్ టైటిల్ గంభీరంగా కనిపించింది. రెండు 'ఓ' అక్షరాల్లో ఒక దానిలో కుంకుమ భరిణ.. మరో 'ఓ'లో ఒలికిపడిన కుంకుమతో భావోద్వేగాలను రంగరించారు. దీనికి టీవీ చానల్స్ బ్యాక్‌గ్రౌండ్‌లో జెట్ ఫైటర్స్, యుద్ధ ట్యాంకులను వదిలాయి. పహల్గాంలో ఆడబిడ్డల నుదుటిన చెదిరిన సిందూరానికి భారత మార్క్ గుణపాఠమని అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. పహల్గాంలో ఓ నేపాలీ, 25 మంది భారతీయులను బలిగొన్న ఉగ్రవాద దారుణంపై పెల్లుబికిన భావోద్వేగాలకు తగినట్టు అజిత్ దోవల్ సలహాతో ప్రధాని మోదీ డిజైన్ చేసిన యుద్ధ వ్యూహం ఇది.**



**వర్ధెల్లి వెంకటేశ్వర్లు**



పాకిస్థాన్ జనావాసాల మధ్యన ఉన్న ఉగ్ర అడ్డాల మీద మన వైమానిక సైన్యం ఇంచుక కూడా గురిచెదరకుండా బాంబులు వేసిందని చానల్స్ బ్రేకింగ్ వేస్తున్నయి. చూస్తుండగానే భారత సైన్యం ప్రతినిధులు మీడియా ముందుకు వచ్చారు. విదేశాంగ కార్యదర్శి, కశ్మీరీ బ్రాహ్మణ దౌత్యాధికారి విక్రమ్ మిస్రీ మధ్యలో కూర్చోగా ఆయనకు కుడి వైపు ఆర్మీ ప్రతినిధి, మహిళ కల్నల్ సోఫియా ఖురేషి.. ఎడమ వైపు వైమానిక దళ ప్రతినిధి, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ కూర్చున్నారు. రాత్రి జరిగిన సర్జికల్ స్ట్రైక్‌కు సంబంధించిన విషయాలను వివరిస్తుంటే.. ఎక్కడ పోగొట్టుకున్నామో..! అక్కడే వెతుక్కుంటునట్టు అనిపించింది.

ఫోన్ తీసి సోషల్ మీడియాలో చూశాను.. వాట్సాప్ నిండా ఆపరేషన్ సిందూర్ ముచ్చట్లే. ఎవరికి తగ్గ విశ్లేషణలు వారు రాస్తున్నరు. యుద్ధం ఏ రూపంలో జరిగినా దుఃఖమేనని కొందరంటున్నరు. యుద్ధం జరగాల్సిందేనని ఇంకొందరు వాదిస్తున్నరు. యుద్ధం వద్దన్న వారిని దేశద్రోహుల కింద జమ కడుతూ ఓ వర్గం పోస్టులు పెడుతున్నరు. వీటన్నింటినీ డామినేట్ చేస్తూ వాట్సాప్ గ్రాడ్యుయేట్లు కొందరు 'మోదీ ది గ్రేట్' లాంటి వచనాలను మిసైల్స్ కంటే వేగంగా అక్షరాయుధాలు సంధిస్తున్నరు. తప్పు లేదు.. దేశ ప్రధాని.. సాహసోపేత నిర్ణయం.. దశాబ్దాల నాటి పాక్ సీమాంతర ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతున్న సమయం. ఆ మాత్రం నైతిక మద్దతు అవసరమే.

ఇదే వాట్సాప్‌లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఆరేండ్ల కిందట అసెంబ్లీలో చేసిన ప్రసంగం క్లిప్పింగ్ ఒకటి వైరల్ అవుతున్నది. ఓపెన్ చేసి చూస్తే.. 'కశ్మీర్ దగ్గర పాకిస్థాన్ గింతంత దేశం అధ్యక్షా... తీసి గట్టిగ కొడితే పోతడు. మనమెక్కడ.. మన సంఖ్యెక్కడ.. వాళ్లెక్కడ? పొద్దున ధోతి పట్టుకొని గుంజుడు.. సాయంత్రం కమీజ్ గుంజుడు.. బార్డర్ మీద సైనికులను సంపుడు.. రోజో న్యూసెన్స్ వాల్యూ. కశ్మీర్‌ను అడ్డం పెట్టుకొని మాదంటే.. మీదంటే..! ఎప్పుడో అప్పుడు పంచాయితీ తెగాలే. అది దేశ సమస్య. ఎస్.. వియ్ షుడ్ సపోర్ట్ దిస్. మా పాలసీ మాది'.. ఈ గిల్లీ కజ్జాలు పెట్టుకునుడు ఆపి, యుద్ధం చేసి శాశ్వత, స్థిర పరిష్కారం చూపండి అన్నట్టు ఆ వీడియోలో కేసీఆర్ కుండబద్దలు కొట్టారు. మూడొద్దుల దిన పొద్దు గడిచిందో.. లేదో భారత్-పాకిస్థాన్ వైరం నాడు కేసీఆర్ చెప్పిన కాడికే వచ్చింది. ఆపరేషన్ సిందూర్‌లో అర్థంతరంగా అస్త్ర సన్యాసం ప్రకటన వచ్చింది.

> **యుద్ధాన్ని భారతీయులేమి కోరుకోలేదు.. యుద్ధం చేయాలని ప్రభుత్వం మీద ఒత్తిడి చేయలేదు. అమానవీయమైన యుద్ధ కుతూహలం భారతీయ స్వభావంలోనే లేదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు చంపితే చావటం.. వదిలేస్తే బతకటం దేశ ప్రజలకు కొత్త కాదు.**

ఎన్నోసార్లు ఉగ్రదాడులు జరిగినప్పుడు, అమాయక ప్రజలను చంపినప్పుడూ భారత ప్రజలు బాధపడ్డారే తప్ప, యుద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి చేయలేదు. తాజాగా పహల్గాం దారుణం జరిగినప్పుడు కూడా ప్రజలు బాధపడ్డారు కానీ, యుద్ధం చేయాలని అడగలేదు. కేంద్రం సీరియస్‌గా తీసుకున్నది. ప్రతీకారంగా రాత్రికిరాత్రే సర్జికల్ దాడులు చేసింది. పాక్, పీవోకేలోని 9 స్థావరాలపై మన వైమానిక దళం విరుచుకుపడ్డది.. టెర్రరిస్టులను మట్టుబెట్టింది. మన సైన్యం యుద్ధ విన్యాసానికి ప్రపంచమే అబ్బురపడ్డది.. ఆశ్చర్యపోయింది. శభాష్.. అని ఆమోదం తెలిపింది.

2016 ఉరిలో 17 మందిని దారుణంగా చంపిన నేపథ్యంలోనూ, 2019లో పుల్వామాలో 40 మంది జవాన్లను చంపిన సందర్భంలోనూ కేంద్రం సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. కానీ, ఆ దాడి పాక్ పీవోకే వరకే పరిమితమైంది. ఇప్పుడు నేరుగా పాకిస్థాన్‌లోని భూభాగంలోకి ప్రవేశించి దాడులు చేసింది. అక్కడి ఉగ్రవాద కేంద్రాల మీద మిసైల్స్ వేసింది. 80 మందికి పైగా ఉగ్రమూకను హతమార్చింది. భౌగోళిక నియంత్రణ రేఖ దాటి ఆ దేశం మీదికి దండయాత్ర చేశామంటే.. యుద్ధం చేయటానికే అనే సంకేతాలు పంపినట్టే కదా..!

ఒక్కసారిగా పరిస్థితులు గంభీరంగా మారిపోయాయి. పాకిస్థాన్ మనల్ని కవ్విస్తూ పేలుడు పదార్థాలు నింపిన వందల డ్రోన్లను ఏకధాటిగా వదిలింది. మన సైన్యం ఎస్-400 సుదర్శన చక్రాన్ని నలుదిక్కులకు తిప్పి ఆ డ్రోన్లను తిప్పికొట్టింది. ఇదంతా గమనించే 'తాడోపేడో ఏదో ఒకటి తేలిపోనీ..! ఎంతకాలం ఈ నటన' అన్నట్టు ప్రజలు మానసికంగా సంసిద్ధులయ్యారు. యుద్ధ సమయంలో ఎలా మెలగాలో తమను తాము మలుచుకున్నారు. యుద్ధ బీభత్సాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. సరిహద్దుల్లో భారత త్రివిధ దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నయి. శనివారం ఉదయం పాక్ సరిహద్దు నుంచి ఆ దేశ సైన్యం పీవోకే వైపు కదిలినట్టు సమాచారం అందింది.. మన వైపు భారత సైన్యం కూడా హైఅలర్టుతోనే కాచుకొని ఉన్నది.. భారత నుదుటిన విజయ సిందూరం దిద్దటానికి సర్వసన్నద్ధమై ఉన్నది. యుద్ధం తథ్యం అన్నట్టు వాతావరణం వేడెక్కింది.

> **యుద్ధం తప్పదనే సంకేతాలు వెలువడ్డయి. ఒక రకంగా ప్రభుత్వమే ఇటువంటి సంకేతాలు ఇచ్చింది. సైన్యం నుంచి రిటైర్ అయిన లాన్స్ నాయకుల నుంచి కర్నల్స్, లెఫ్టినెంట్ కర్నల్స్ వరకు తల్లి భరతమాత ఉగ్ర శృంఖలాలు తెంచే క్రతువులో తాము భాగస్వాములం కాలేకపోతున్నామని బాధపడ్డరు. కొందరైతే తమకు ఆర్మీ చీఫ్ ఆఫీస్ నుంచి పిలుపు వస్తుందని వెయ్యి కండ్లతో ఎదురుచూశారు. దేశమంతటా అలుముకున్న ఓ ఉద్వేగపు అలజడి భారతీయులను ఏకతాటి మీద నిలబెట్టింది.**

పాక్ ఆక్రమిత భూభాగం మన దేశం భౌగోళిక స్వరూపంలో మిళితం కావాలనే ఆకాంక్ష ప్రజల్లో ప్రబలమైంది. మన సైన్యం తెగించింది. సాంకేతిక యుద్ధ విన్యాసాలతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. కాల్బలం ఇంకా కదలకుండానే గెలుపు వాకిట నిలబడ్డది. కానీ, సగటు భారతీయుని ఊహకు కూడా అందని విధంగా.. కాల్పుల విరమణకు భారత్-పాక్ దేశాలు అంగీకరించాయి. ఈ ఒప్పందం వెంటనే అమల్లోకి వస్తుందని మే 10న శనివారం సాయంత్రం సరిగ్గా 5.30 గంటలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ట్విటర్ ఖాతా నుంచి ట్వీట్ చేశారు. తాము జరిపిన 48 గంటల మధ్యవర్తిత్వంతో ఇది సాధ్యమైందని చెప్పుకొచ్చారు. ట్రంప్ పోస్టు పెట్టిన అర్ధ గంటలో కోటి మంది దాన్ని చూశారు. 10 కోట్ల మందికి సమాచారం చేరింది. ఆ తర్వాత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియా ముందుకొచ్చారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ నిజమేనని ధ్రువీకరించారు. భారత్-పాక్ నడుమ ఏ గొడవలు వచ్చినా ఇద్దరమే మాట్లాడుకుంటమనేది భారత స్థిర నినాదం. ఇది ఇప్పటి మాట కాదు.. 1972 సిమ్లా ఒప్పందం నాటి మాట. 1999 లాహోర్ డిక్లరేషన్‌లోనూ ఈ మాటకే కట్టుబడి ఉన్నం. మనం యుద్ధ సన్నాహాల్లో ఉన్నప్పుడు 'సీజ్ ఫైర్' అని ట్రంప్ ప్రకటించడమేమిటి? 'అవునవును' అని మనం తల ఊపడం ఏమిటి? ట్రంప్ మధ్యవర్తిత్వానికి తలవంచామా? అణ్వాయుధాల బ్లాక్‌మెయిల్‌కు భయపడ్డామా? ప్రధాని ప్రసంగంలో సమాధానం దొరుకుతుందని ఆశించాం. కానీ, ఆయన ట్రంప్ దొర పేరు ఎత్తకుండా జాగ్రత్తపడ్డారు.

హఠాత్తుగా రెండు, మూడు రోజుల్లోనే కాల్పుల విరమణ ఎందుకు ప్రకటించినట్టు? అతి సునాయాసంగా గెలుపు అంచుల దాకా వెళ్లిన భారతీయ సైన్యాన్ని అస్త్ర సన్యాసం చేయాలని ఆదేశించిన జగన్నాటక సూత్రధారి ఎవరు? అమాయకపు ఆడబిడ్డల నుదుటి సిందూరాలను చెరిపిన పహల్గాం టెర్రరిస్టులను మట్టుబెట్టారా? కనీసం వారు పట్టుబడ్డారా? పోనీ.. పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చిందా? 26 మంది ఆడబిడ్డల ఐదోతనాన్ని తుడిచిన ఆ.. ముష్కరులను ప్రాణాలతో అప్పగిస్తామని పాక్ హామీ ఏమైనా ఇచ్చిందా? పీవోకే నుంచి వైదొలిగి భారత్‌కు ఇచ్చేస్తామని ప్రతిపాదించిందా? పాక్‌లో వెళ్లూనుకున్న ఉగ్ర తండాలను సమూలంగా పీకివేశామా? ప్రాణానికి ప్రాణమే లక్ష్యంగా మనం ప్రతిదాడికి దిగామా? ఏ ప్రశ్నకు సమాధానం లేకుండా.. ఏ గమ్యం చేరకుండానే అస్త్ర సన్యాసం చేయించటం వెనుక ఆంతర్యం ఏమిటి? అనేవి బేతాళ ప్రశ్నలే.

# గ్రూప్-1పై పోరాటం ఆగదు

**గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్తుంటే.. కేసీఆర్ ప్రభుత్వాన్ని మించిన సంక్షేమ సర్కారును తీసుకొస్తారేమోనని ప్రజలంతా ఆశించారు. కానీ, రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను కాలదన్ని తెలంగాణలో ఇందిరమ్మ ఎమర్జెన్సీ రాజ్యాన్ని తీసుకొచ్చింది. ఈ నయా ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ విధ్వంసం జరుగుతున్నది. ప్రశ్నించినవారిపై దాడులు, అక్రమ కేసులు, నిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయి. తాజాగా టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై ప్రశ్నించిన నాపై కేసు పెట్టారు. గ్రూప్-1 పోస్టుల భర్తీలో జరిగిన తప్పులను ఎత్తిచూపిన నెల తర్వాత కేసు పెట్టడం రేవంత్ సర్కారుకే చెల్లింది.**



**పాడి కౌశిక్‌రెడ్డి**

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలోనే 2 లక్షలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆ పార్టీ నాయకులు ఎన్నికలకు ముందు ఊరూరా ఊదరగొట్టారు. యువత, నిరుద్యోగుల భుజాలపై మూడు రంగుల జెండాలను మోపి, వారి కష్టాన్ని నిచ్చెనగా మార్చుకొని రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠంపై కొలువయ్యిండు. ఏరు దాటే దాక ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడ మల్లన్న అన్నట్టుగా అవసరం తీరాక తెప్ప తగలేశారు. కాంగ్రెస్ జెండాలు మోసి మోసి యువత భుజాలపై అయిన పుండ్లపై కారం చల్లారు. కొత్తగా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోగా.. దేశంలో ఎక్కడా లేని విధంగా కొలువులు వద్దని ధర్నాలు, రాస్తారోకోలు రాష్ట్ర యువత చేస్తున్నారని ఊరూవాడా చాటింపు వేస్తున్నారు. అంతకుముందు నిరుద్యోగ భృతి వట్టి మాటేనని ఉపముఖ్యమంత్రి భట్టి తేల్చేశారు.

భారీ గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పి, గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 503 పోస్టులకు 60 పోస్టులను కలిపి తమ ఘనతగా ప్రచారం చేసుకున్నది. క్రెడిట్‌ది ఏముందిలే.. యువతకు కొలువులు వస్తే చాలని అనుకున్నాం. కానీ, కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చి, పోస్టులు పెంచుతామని చెప్పి.. పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించలేకపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, టీజీపీఎస్సీ ఉదాసీనత కారణంగా గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదటి నుంచి తప్పులతడకగా మారింది.

> **లక్షల మంది అభ్యర్థులు రాసే నీట్, ఎప్‌సెట్ లాంటి పరీక్షలకే బయోమెట్రిక్ పద్ధతిని అమలు చేస్తుండగా, వేల మంది మాత్రమే రాసిన గ్రూప్-1 పరీక్షకు మాత్రం బయోమెట్రిక్ హాజరు లేకపోవడం విస్మయం కలిగిస్తున్నది. నోటిఫికేషన్‌లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తామని టీజీపీఎస్సీ స్పష్టంగా పేర్కొన్నది. కానీ, ఆ తర్వాత తమ అస్మదీయులకు అయాచిత లబ్ధి చేకూర్చేందుకే బయోమెట్రిక్‌ను బుట్టదాఖలు చేసింది. అందుకే పరీక్ష ముగిసిన వెంటనే 21,075 మంది అభ్యర్థులు పరీక్ష రాశారని పేర్కొన్న టీజీపీఎస్సీ.. ఆ తర్వాత 10 మందిని అక్రమ మార్గంలో చేర్చింది.**

ఆ పదిమంది పెరగడం నిజమేనని హైకోర్టు సాక్షిగా అంగీకరించిన టీజీపీఎస్సీ.. వారు ఏ ప్రాతిపదికన పెరిగారనే విషయంపై మాత్రం నోరు మెదపడం లేదు. అంతేకాదు, 20,161 మంది పరీక్షలు రాసినట్టుగా ఒకానొక సమయంలో అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్నది. హాల్‌టికెట్ల విషయంలోనూ అనుమానాలకు తావిచ్చే విధంగా గందరగోళం సృష్టించింది. ప్రిలిమ్స్‌కు ఒక హాల్‌టికెట్, మెయిన్స్‌కు మరో హాల్‌టికెట్ ఇవ్వడం వెనుక కూడా ఏదో కుట్ర దాగి ఉన్నది.






రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 మహిళా కళాశాలల్లో గ్రూప్-1 పరీక్షలు జరగగా.. కోఠిలోని ఐలమ్మ మహిళా కళాశాల పరీక్షా కేంద్రంలో మాత్రమే ప్రత్యేకంగా మహిళా అభ్యర్థులను కేటాయించారు. ఇక్కడ రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా సుమారుగా 563 మంది పరీక్ష రాసినట్టు తెలుస్తున్నది. అయితే, ఎక్కడా లేని విధంగా ఈ ఒక్క పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన వారిలో సుమారు 10 శాతం మంది అభ్యర్థులు గ్రూప్-1 కొలువులను కొల్లగొట్టారు. ఈ ఒక్క పరీక్షా కేంద్రం నుంచి సుమారు 60-70 మంది వరకు సెలక్ట్ అవ్వగా, ఇతర ప్రాంతాల్లోని 40కి పైగా పరీక్షా కేంద్రాల నుంచి ఒక్కరు కూడా సెలక్ట్ కాకపోవడం విడ్డూరం. కాంగ్రెస్ నేత రాములు నాయక్ కోడలు కూడా ఐలమ్మ పరీక్షా కేంద్రంలోనే పరీక్ష రాశారు. ఆమె ఎస్టీ క్యాటగిరీలో టాప్ ర్యాంకు సాధించారు. ఈ విషయాన్ని నేను గత నెలలో ప్రెస్‌మీట్ పెట్టి ప్రస్తావించాను. అప్పుడు ఎక్కడో కూడా కులాన్ని కించపరచలేదు. కానీ, కుట్రపూరితంగా నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు.

గ్రూప్-1 టాపర్లలో చాలామంది ఒకే పరీక్షా కేంద్రంలో, అందులోనూ ఒకే గదిలో పరీక్ష రాసినట్టు అనుమానాలు ఉన్నాయి. అంతేకాదు, హాల్‌టికెట్ నెంబర్‌లోని చివరి ఒక్క అంకె తేడాతో ఒకరి వెనుక ఒకరు కూర్చున్న చాలామంది అభ్యర్థులకు ఒకే విధమైన మార్కులు రావడం కూడా అనుమానాలకు తావిస్తున్నది. మరోవైపు తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగింది. సుమారు 7,800 మంది తెలుగు మీడియం అభ్యర్థులు పరీక్ష రాయగా, 10 శాతం కూడా సెలక్ట్ కాకపోవడం వెనక గల కారణం ఏమిటి? అదే సమయంలో 9 మంది ఉర్దూ మీడియం అభ్యర్థులు పరీక్ష రాయగా, వారిలో ఏడుగురు ఎలా సెలక్ట్ అయ్యారు? దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి?

టీజీపీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాన్ని భ్రష్టు పట్టించారు. అందుకే నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి పరీక్షలు జరిగి, ఫలితాల విడుదల వరకు అన్నింటా అవకతవకలు చోటుచేసుకున్నాయి. గ్రూప్-1 కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. పేద విద్యార్థుల తరపున ప్రశ్నిస్తుంటే ప్రభుత్వ పెద్దలు ఉలిక్కిపడుతున్నారు. ఆ తప్పుల నుంచి తప్పించుకునేందుకే కేసులు పెడుతున్నారు. నిర్బంధాలకు, కేసులకు భయపడకుండా గతంలో ఎన్నోసార్లు పేదలకు అండగా నిలబడ్డా. ఎన్నెన్నో కేసులను ఎదుర్కొన్నా. ఇప్పుడు పేదల విద్యార్థుల కోసం చేస్తున్న పోరాటంలో నమోదైన ఈ కేసు నాకు దక్కిన మరో ఆభరణం లాంటిదే. ఎన్ని కేసులు పెట్టినా అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే ఉంటా. పేద విద్యార్థుల తరపున నా గళం వినిపిస్తూనే ఉంటా.

**(వ్యాసకర్త: హుజూరాబాద్ శాసనసభ్యులు)**





## పార్టీ సమ్మతి తీసుకోవాలి కదా?



కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ ఎంపీ (శశిథరూర్)ని దౌత్యపరంగా చర్చించేందుకు భారత ప్రతినిధిగా విదేశాలకు పంపించాలనుకున్నప్పుడు పార్టీని సంప్రదించాలి. కానీ, కేంద్రం ఎలాంటి సమాచారం లేకుండానే ఎంపీని ఆ జాబితాలో చేర్చింది. కనీసం ఆ ఎంపీ అయినా పార్టీ సమ్మతి తీసుకోవాలి కదా?

**- జైరామ్ రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నేత**

## సామాన్యుడి మాట



వేల్పుల మల్లయ్యకు అన్నం తినిపిస్తున్న లచ్చవ్వ

# కనికరం లేని గాంధీ దావఖాన!

> **మేం యాదవులం. మా ఇలవేల్పు మల్లన్న దేవుడు. అందుకే మా అత్తామామ నా పెనిమిటికి 'వేల్పుల మల్లయ్య' అని పేరు వెట్టిర్రేమో! ఇగ మూడేండ్లకోసారి మల్లన్న పట్నాలేసుకునుడు మా ఇంట్ల ఎన్కటికెళ్లి అస్తున్న పద్ధతి. ఎప్పట్లెక్కనే ఈసారి గూడ ఇంట్ల ఒగ్గు డప్పును తిప్పే కాలమొచ్చింది. అందుకే, మూణ్నాలుగు రోజుల సంది మా మల్లయ్య నన్ను నిల్సున్నకాడ నిల్వోనిస్తలేడు, కూసున్నకాడ కూసోనిస్తలేడు.**

'జానే లచ్చవ్వా... ఊరంతా ఒక్కసారే పట్నాలేసుకుంటమంటే ఆ ఒగ్గోళ్ల సీనన్న ఏడికని ఉర్కుతడు, ఎంతమందికని వోతడు? ఎవరి ఎల్లువాను తీరు వాళ్ల వారానికొగలు పట్నాలేసుకుంటే ఒగ్గోళ్ల సీనన్నకు గూడ సాయం జేసినోళ్లమైతం గదా?' అని నడీ మంచంల నడుమాల్కి మొత్తుకుంటనే ఉన్నడు. 'అయ్యో ఆగరాదుల్లా, పట్నాలు మా ఏస్కుందాం గని. పట్నాలేసుకోకుంటే ఆ మల్లన్న దేవుడూకుంటడా?' అని జవాబిస్తనే ఉన్న. నడిమిట్లనే.. 'అగ్గో... ఇగ గంగ తానానికి పోవద్దా? కొన్నొద్దులైతే మళ్లా తీరువాటం ఉండది, ఇగ నీ ఇట్టం. పొలం కోతకచ్చినన్క పోదాం పా అంటే మాత్రం నేనైతే రాను' అని బెదిరియ్యవట్టిండు మా మల్లయ్య. ఇంతల మా శిన్నోడు రాజు రానె అచ్చిండు. 'అవ్వా.. కారు మాట్లాడిన. రేపు ఎగిలివారంగనే ఇంటికస్తది. జెప్పన పండుకోర్రి, పొద్దున్నే లేసి అందరికందరం కాళేశ్వరం పొయ్యొద్దాం' అని నిద్ర వోయిండు.

> **మా శిన్నోని మాట ఇనంగనే 'ఎహ్హె నీ అవ్వ.. ఇంట్ల అవ్వా కొడుకులదే మొత్తం నడుస్తున్నది పోర్రి..' అని మా మల్లయ్య కారడ్డమాడవట్టిండు. 'నీకు ఇయ్యాళ్ల నిద్రొస్తలేదా? ఏమో కారడాలు బాగాడుతున్నవ్' అని ఇట్లకెళ్లి అంటనే ఉన్నా.. అట్లకెళ్లి గుర్‌ర్‌ర్.. గుర్రుమని గుర్క రానే అస్తున్నది. మా మల్లయ్య గొర్లు కాసుడు బంజేసి, ఎవుసం జేయవట్టి పదిహేనేండ్లాయె. మాకున్నది కొద్దిగంత భూమి, ముగ్గురు కొడుకులు. ఆళ్లు నపరో సార్గం జేస్తనే ఉంటరు గనీ, ఎవుసం మాత్రం మా అయ్యనే జేస్తడు. పొద్దున గంగ తానానికి పోవుడుంది గదాని ఎక్కడోళ్లక్కడ నిద్రవోయిర్రు. ఆ పని, ఈ పని జేసేసరికి నాకే ఆల్సమైంది. ఆడోళ్లకు తప్పుతదా ఇంటి పని? నేను గూడ వొయ్యి ఇగ నడుమాల్చిన.**

***

ఎగిలివారంగ మూడు గొడ్తున్నది. 'రాజూ.. ఓర్రాజుగా...' అని మా శిన్నోన్ని లేపుతనే ఉన్నడు నా పెనిమిటి. నిద్రలేసిన శిన్నోడు డ్రైవర్‌కు ఫోన్జేసెరికి రానే అచ్చింది కారు. ఇంటోళ్లందరం అన్ల గూసున్నం. మా తొవ్వ కాళేశ్వరం గుడికాడికి సాగుతున్నది. అక్కడ మూడు నదుల నీళ్లు వారుతయి. మల్లన్న పట్నాలేసుకునే ముందు అక్కడ గంగ తానం జేస్తే సుట్టో.. ముట్టో.. ఏమున్నా వోతదని మా నమ్మిక. ఎనిమిది గొట్టేసరికి కాళేశ్వరం గుడికాడికి శేరుకున్నం. ఒక్కొక్కలు వొయి గంగల మునిగి, తానం జేసి గడ్డకు ఎక్కుతనే ఉన్నరు. మా మల్లయ్య గూడ గంగల మునిగి తానం జేసిండు. అప్పటిదాకా మంచిగనే ఉన్నడు గని, ఒక్కసారిగ ఏమైందో ఏమో గడ్డమీదికొచ్చి నిల్సున్నకాన్నే కూలవడ్డడు. 'మల్లన్నా, ఓ మల్లన్నా..' అని మాతోని అచ్చిన కులపోళ్లు అమాంతం లేవట్టుకొచ్చి కార్ల పండవెట్టిర్రు. కొద్దిసేపటికి క్యాలికచ్చిన మల్లయ్య 'రాజు, అరేయ్ రాజు.. నాకంత ఎటో అయితందిరా.. పెయ్యంత తిమ్మిర్లొస్తున్నయి, కండ్లు మూతలు వడ్తున్నయి' అని మా శిన్నోనికి శెప్పవట్టిండు. ఇగ లాభం లేదని మల్లయ్యను వట్టుకొని అదే కార్ల కన్నారం దావఖానకు ఏస్కచ్చినం.

మార్చి 28, శుక్లారం నాడు, మజ్జాన్నం ఒంటిగంటకు మా మల్లయ్యను జూసిన కన్నారం డాక్టర్లు... 'తీపిరోగం' ఉన్నది గదా? మెల్లగా మా తక్కువైత ది, మీరేం పరేషాన్ గాకుర్రి' అని ధైర్నం జెప్పిర్రు. డాక్టర్ల నోట ఆ మాటిన్న మాకు పొయిన పానం లేసచ్చినట్టయింది. మజ్జాన్నం నుంచి మందో, మాకో మా ఇస్తర్రు గదా, ఇగ మంచిగనే ఐతడు మా మల్లయ్య అని నేన్గూడ ధైర్నంగనే ఉన్న. ఇంతల ఒక డాక్టర్ మా దగ్గరికచ్చి 'మల్లయ్య కొంచెం సీరియస్ ఉన్నడు. శనారం, ఐతారం రెండ్రోజులు కన్నారం డాక్టర్లు అందుబాటులుండ రు. రేపు మల్ల ఏమన్న జర్గరానిది జర్గితే మొత్తానికే మోసమైతది. ఎందుకైన మంచిదే ఇప్పుడు మల్లయ్యను వట్టుకొని మీరు పట్నం బోతనే మంచిది' అని సావు కబురు సల్లగ జెప్పిండు. 'నాత్రి పది గొడ్తున్నది, గీ నాత్రి ఎక్కడికి వోతం సార్?' అనడిగితే.. 'ఇగ మీ ఇట్టం' అని లచ్చ రూపాల బిల్లు శేతిల వెట్టిండు. అప్పటిదప్పుడు మా కొడుకులు లచ్చరూపాలు సగవెట్టి బిల్లు గట్టిర్రు. అంబులెన్స్ మాట్లాడుకొని అదే నాత్రి మా మల్లయ్యను పట్నం దవాఖానకేస్కచ్చినం.

శనారం నాడు మబ్బుల మూడు గొట్టేసరికి గాంధీ దావఖానకు శేరుకున్నం. అదేదో.. ఎమర్జెన్సీ వాడనట! అంబులెన్స్ సీద వొయ్యి అక్కన్నే ఆపింది. గంటాయె డ్రైవర్ బండి ఆప్జేసి, డాక్టర్లచ్చి 'ఏమైందని' మందలిచ్చుడు లేదు, మేం బోతే వాళ్లచ్చుడు లేదు. తెల్లారి తొమ్మిది కావట్టింది. మొగోళ్లను ఎటూ పట్టించుకుంటలేరు, ఆడిదాన్ని నన్ను జూసన్న జర జాలివడుతరేమోనని 'సారూ.. జర నా పెనిమిటిని జాయిన్ జేస్కోరి' అనడిగితే అక్కడున్నాయ్నె కొట్టుడే మా తక్కువ, నా మీదికి కయ్యిమని లేసిండు. దెబ్బకు జడ్సుకున్న. 'మీరు ఇక్కడ నాలుగ్గంటలున్నా వాళ్లు మిమ్మల్ని షరీఖ్ జేస్కోరు. మీరే వొయ్యి వీల్‌చైర్ ఎక్కడుందో దొర్కవట్టుకొని మీ నాయినను లోపల్కి పట్కవోర్రి' అని అక్కడెవ్వలో చెప్తే మా శిన్నోడు వీల్‌చేర్ కోసం పోయిండు. పోయి అద్దగంటైనా వాడొస్తలేడు. ఫోన్దీసి వానికి గల్పిన. 'ఏమైందిరా రాజు, ఇంకా అస్తలెవ్వ?' అనడిగితే.. 'రాజు ఎవ్వలమ్మా.. రాజు లేడు గాజు లేడు' అని జవాబియ్యవట్టిండు. 'అగ్గో ఇది మావోని ఫోను గదా, నీ దగ్గరికి ఎట్లచ్చింది సార్' అని మళ్లడిగితే అప్పుడు శెప్పవట్టిండు.. 'మీవోడు నా దగ్గర ఫోన్ కుదవెట్టి వీల్‌చేర్ తీస్కవోయిండమ్మ నువ్వు ఫోన్ పెట్టెయ్యి' అని కట్జేసిండు. అట్ల ఫోన్ కట్టైందో లేదో... మా శిన్నోడు కుర్సీ వట్టుకొని రానే అచ్చిండు.

'లెవ్వకుండున్న మనిషిని నలుగురం అమాంతం బట్టుకొని ఆ కుర్సీల బల్మీట్టికి కూసోవెట్టినం. లోపల్కి పట్కవొయినంక నరాల వాడ ఎక్కడుంటదని అడుగుతే పట్టించుకున్నోడే లేడు. ఇంతల అట్నుంచి వోతున్న ఓ మనిషి.. 'అమ్మా... ఇక్కడెవ్వలేం జెప్పరు, సీద పట్కవొయి అక్కడ బెడ్లుంటయి, దాన్ల పండుకోవెట్టుర్రి. మీ ఆయనకు నూకలు బాకీ ఉంటే డాక్టరొస్తడు, లేకుంటే లేద్' అని శెప్పవట్టిండు. ఆయన అన్నట్టే అక్కడున్న బెడ్డు మీద మా మల్లయ్యను పండవెట్టి మూడు గంటలైంది గని, డాక్టరచ్చింది లేదు, చెయ్యి వట్టింది లేదు. నాకే ఇగ తిక్కలేసింది. 'సీఎం సారూ.. నీకు, నీ దవాఖానకో దండం' అని మన్నులనుకొని 'అరేయ్ రాజుగా.. ఉన్న దమ్ముడువోయినా మంచిదేరా? ఇక్కడుంటే మీ బాపు బతుకడురా..' అని గాంధీ దావఖాన్లకెళ్లి బయటికొచ్చినం. అట్ల తీస్కచ్చినం కావట్టే.. మా మల్లయ్య ఇగో గిట్ల మూడు బుక్కల అన్నం దినుకుంట, మా కండ్లకు కనవడ్తున్నడు.



**గడ్డం సతీష్**
99590 59041